# చిట్టి

కాంతం కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తున్నది. ఏడవ గలుగుతున్నది - అదృష్టవంతురాలు. కాంతం ఏడుపు తన గుండెల్లో నగారావాయింపు. ఆ ఏడుపు చెవుల పడుతుంటే తనకు భయమేస్తున్నదనీ, చిట్టిని గురించి ఆలోచించటానికి తోచటంలేదనీ కాంతం తెలుసుకోదు. కాంతంత, దుల్లిరదృష్టవంతురాలు. దాని బాధ తనకు తెలీదు. తనకు భయమేస్తున్నదని గాని ఏడుపు రావటం లేదు. తన గుండె అడుగున చిల్లిపడి అశ్రువులన్నీ ఎటో కారిపోయినై. చిట్టిని చూచి అస్తమానమూ నవ్విన తనూ కాంతమూ ఈ విధంగా ఏడవటమేమిటి?.... ఎక్కడో పొరపాటు జరిగింది. దేవుడింకా తెలుసుకోలేదు.

కాంతం సమీపానికి వెళ్లటానికి తనకు ధైర్యం లేదు. కాంతం చిట్టికోసం ఏడవకుండా ఉంటే ఎంత బాగుండును! ఏడిచి చిట్టిచావు నిజం చేస్తున్నది కాందం...

"అమ్మా, నాకళ్లకి నిద్దరొస్తుందే!" అనేది చిట్టి. అది జ్ఞాపకం వచ్చి తనకేడుపు రావటం దేనికీ? అప్పుడు తను నవ్వలా? "నీకెక్కడ ఆకవుతుందే, చిట్టి తల్లీ?" అని అడిగితే చిట్టి వాళ్లమ్మతో "నోత్తోనే!" అనేది గట్టిగా - కాంతం చెవిటిదైనట్టు! చిట్టికి నోట్లో ఆకలయేది. చిట్టి కళ్లకి నిద్దరొచ్చేది! అవన్నీ జ్ఞాపక్ తెచ్చుకుంటే కాంతం ఏడవదు. అట్లా ఏడుస్తుంటే కాంతంతో ఇవన్నీ మాట్లాడటం ఎట్లా?

మొగుడు చచ్చుపోతే పెళ్లాంలాగా కాంతం ఇంకో మనిషైపోతుంది. ఇక ముందు కాంతం చిట్టికి అమ్మ అనేమాట ఉండదు. చిట్టికి అమ్మకాని కాంతంతో తను ఎట్లా మాట్టాడటం? ఏడవకుండా ఉంటే కాంతం మారేది కాదేమో! తను మాత్రం బతికి ఉన్నంత కాలమూ చిట్టి తండ్రిగానే ఉండిపోవాలి. అది అసాధ్యం కాదు. చిట్టిని తల్చుకొని తాను ఎప్పటల్లే నవ్వగలగాలి. ప్రయత్నిస్తే సాధ్యమవుతుంది...

అద్దంలో చూసుకుంటే తన మొహమంతా వికారంగా ఉన్నది. అయ్యయ్యో ఈ మొహం చిట్టి ఎట్లా పోల్చుకుంటుంది. తను కూడా మారితే యెట్లా? తనకి కాంతం కొత్తదైపోయినట్టు, తను కాంతానిక్కూడా కొత్తవాడైపోతే ఎట్లా?...

కాంతం తన దుఃఖమంతా ఖర్చు చేసేసుకుంటున్నది? దుఃఖమంతా అయిపోయి మళ్లా మామూలు మనిషి అయి కాంతం ఇతర విషయాలు మాట్లాడేటప్పుడు తన కెట్లా ఉంటుంది? చిట్టిని మరిచిన కాంతంతో తను కాపరం చెయ్యడం ఎట్లా?...

చిత్రం! మనిషికి జబ్బు చేస్తే మొదటి ప్రయత్నంలోనే నయం చెయ్యాలి. ఒకసారి విఫలమై రెండోసారి విజయం పొందటం అంటూ ఉండదు. చిట్టికి చేసిన జబ్బు అట్టే

ప్రమాదకరమయింది కాదు. చివరి దాకా డాక్టరామాట అంటూ వచ్చాడు. తనకు తట్టలేదు గాని చిట్టి జబ్బు నయం చేసే మందు ఆయుర్వేదంలో తప్పకుండా ఉంటుంది. హోమియోపతిలో కూడా! ఇటువంటి జబ్బే ఆయనెవరో ఏపిస్‌తో నయం చేశాట్ట. చిట్టికి ఏపిస్ వేస్తే సరి! షాపుల్లో పేటెంటు మందులున్నై- విటామను. బీ ఉన్నటువంటివి!...

"ఏమండీ, పాపం, మీ పిల్ల పోయిందిటగా? హరి హరీ! ఎంత చలాకీ పిల్లండీ! పోయివస్తాను. ఈ బస్సుకు మాచారం పోతున్నాను. ఈ రైతులేం చంపుకు తింటున్నారండి – కాకపోయినా!" ఆయన అంతలోనే చిట్టి విషయం మరిచిపోయినాడు!...

కాంతం ఏడుపు వినిపించటం లేదు. పాపం, ఏడిచి, ఏడిచి అలిసిపోయిందేమో! లేదు. లేదు. నిశ్శబ్దంగా ఏడుస్తున్నది. పాపం, కాంతం! తనకేసి ఎంత చిత్రంగా చూసింది! చిట్టి జబ్బు నయం కానందుకు కాంతం తనని క్షమించలేదు. ఇక చిట్టిని గురించి తను ఎవరితో మాట్లాడతాడు?...

చిట్టికీ తనకూ ఇరవై రెండేళ్లు తేడా. ఈ తేడా క్షణక్షణమూ జాస్తి అవుతున్నది గామాలు! ఇంకా పాతికేళ్లు పోయినా చిట్టి మూడేళ్లదేగా! తనకో? తనకి యాభై అవుతై! అప్పుడు తను చిట్టికి తాతయ్యల్లే ఉంటాడు గామాలు!...

నిశ్శబ్దంగా ఏడుస్తుండే కాంతాన్ని చూసి తన గుండె కరగిపోతున్నది. నిజానికి ఈ కాంతం వెనుకటి కాంతం కన్న ఒక విధంగా ఎంతమంచిది! ఈ కాంతం ఇంకోరి పిల్లల్ని చూసి అసూయపడలేదు; చిన్న చిన్న విషయాలను గురించి మనస్సు క్షోభ పెట్టుకోలేదు. చిట్టి ఈ విధంగా తల్లి కొక ఆధ్యాత్మిక శక్తినిచ్చింది గామాలు?...

రెండు యుగాలు – లేక రోజులా – గడిచిన తరువాత ఈ మధ్యాహ్నం కాంతం మారిన కంఠంతో తనను పలకరించింది.

"లేవండి. పోయి స్నానం చెయ్యండి – నాలుగు మెతుకులు నోట్లో వేసుకుందురాగని."

"కాంతం!"

కాంతం దగ్గరకు వచ్చి బుజాలమీద చేతులు పెట్టి, తన మెడమీద మొహం పెట్టి నిశ్శబ్దంగా ఏడవసాగింది. తనకిక ఏడుపాగలేదు. తనూ కాంతమూ కలిసి ఏడవటానికిప్పుడవకాశం దొరికిందా? తన కన్నీళ్లు ఇంతకాలమూ పైకిరాంది ఇందుకా? ఇదివరకు కాంతం ఏడుపు స్వార్థం వల్లనే బాగుండలేదా? ఇద్దరూ కలిసి సమంగా కన్నీరు కార్చటం ఎంత బాగుంది!...

కామంతో కాంతాన్ని కావలించుకోవటం మాత్రమే తానెరుగును. ఇట్లా దుఃఖంతో కావలించుకోవటం ఎరగడు!...

*ముద్రణ : కవిరాట్టు, అభూత కల్పనలు - గల్పికలు, 1942*

*యువ కార్యాలయం, తెనాలి*